క్లుప్తంగా

రోడ్డుపై బైఠాయించిన రైతులు



ధర్నా చేస్తున్న రైతులు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసిన కూడా మిల్లులకు తరలించేందుకు లారీలు రావడం లేదంటూ రైతులు సోమవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి కోతలు కోసి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు పోసి నెలన్నర గడుస్తున్నా ఇప్పటి వరకు కాంటాలు సక్రమంగా కావడం లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. లారీల సమస్య పరిష్కారం చేసేంత వరకు ధర్నా విరమించేది లేదన్నారు. సంఘటనా స్థలానికి ఏఎస్సై మోతీరామ్ చేరుకుని లారీల సమస్య పరిష్కారం చేయిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో వంద మంది రైతులు పాల్గొన్నారు.

'డబుల్' లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

గంభీరావుపేట: మండలంలోని గోరింటాల గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించుకుంటున్న 30 మంది లబ్ధిదారులకు మొదటి విడతగా మంజూరైన చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలుముల అంజమ్మ, ఎంపీటీసీ అంజిరెడ్డి, నాయకులు లక్ష్మణ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప కామరాతి కల్యాణం



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ముస్తాబాద్: మండలంలోని మోహినికుంటలో బీరప్ప కామరాతి కల్యాణ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జరిగిన కల్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు. పెద్ద పట్నంతో ఆకట్టుకున్నారు. సర్పంచ్ కల్వకుంట్ల వనజ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, ఉపసర్పంచ్ సంధ్య, సతీశ్, శ్రీనివాస్‌రావు, జంపెల్లి దేవయ్య, బండారి రాజేందర్, ఎల్లం, రాజు, బాలయ్య, రమేశ్, విజయ్ పాల్గొన్నారు.

ప్రమాద కూడలి

- నిత్యం ప్రమాదాలే
- కనిపించని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు
- చర్యలు చేపట్టాలని వేడుకోలు

ఎల్లారెడ్డిపేట: మూడు రహదారులను కలుపుతూ ఏర్పాటు చేసిన కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. అతివేగంగా వస్తున్న వాహనాలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులో సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారి నుంచి రగుడు మీదుగా సిరిసిల్ల జిల్లా కేంద్రంతో సంబంధం లేకుండా కరీంనగర్ జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు బైపాస్ రోడ్డును నిర్మించారు. ఈ బైపాస్ రోడ్డుతో దూరం తగ్గడమే కాకుండా వాహనాల రాకపోకలు తక్కువగా ఉండడం వల్ల ప్రయాణం సులభతరంగా మారింది. అయితే నూతనంగా నిర్మించిన బైపాస్‌పై నాలుగు నెలల క్రితం రాకపోకలను ప్రారంభించారు. మూడు రోడ్లు కలిసే ఈ కూడలిలో నిత్యం వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మరణించాడు. నాలుగు నెలల కాలంలో ఆ రహదారిపై గల జంక్షన్ వద్ద 11 సార్లు ప్రమాదాలు జరిగి, ఒకరు ప్రాణాలు కోల్పోయారు. డేంజర్ జంక్షన్‌గా మారిన దీనిపై అధికారులకు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు శాపంగా మారింది.



ప్రమాదకరంగా మారిన వెంకటాపూర్ కూడలి

పెరిగిన ప్రమాదాలు

సిరిసిల్ల పట్టణంతో సంబంధం లేకుండా ఉమ్మడి కరీంనగర్‌కు వెళ్లేందుకు ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి బైపాస్ రోడ్డును నిర్మించారు. నిర్మించిన ఈ కొత్త రోడ్డుతో గతంలో కంటే 20 నిమిషాల ముందే ప్రయాణికులు గమ్యం చేరుతున్నారు. అంతేకాకుండా బైపాస్ రోడ్డు కూడా డబుల్ రోడ్డు కావడంతో వాహనదారులు ఇబ్బంది లేకుండా సకాలంలో సులువుగా కరీంనగర్ చేరుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసినప్పటికీ, డేంజర్ జంక్షన్ వద్ద మాత్రం కనీస చర్యలు తీసుకోవడం మరిచారు. దీంతో నూతన రహదారిపై ప్రయాణం వాహనదారులకు రక్షణ లేకుండా పోయింది.

కనిపించని హెచ్చరిక బోర్డులు

వెంకటాపూర్ శివారులో నిర్మించిన జంక్షన్ వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం హెచ్చరిక సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. వాహనాల వేగం తగ్గించేందుకు హెచ్చరిక బోర్డులతో పాటు స్పీడ్ బ్రేకర్లు లేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాలతో వాహనదారులు కొత్త బైపాస్‌పై జంక్షన్‌ను దాటి ప్రయాణాలు చేయడానికి జంకుతున్నారు. దీనికి తోడు వెంకటాపూర్‌లో ప్రారంభమైన ప్రయాణం రగుడు వద్ద సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రహదారిని కలుస్తుంది. అక్కడ కూడా అధికారులు ముగింపు దశలో కూడా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. ఆ రోడ్డును కలిసే సమయంలో మంచిగా ఉన్న రోడ్డుతో వాహనదారులు జర్రున అతి వేగంతో ప్రయాణాలు చేయడం మూలంగా కూడా పెద్ద ఎత్తున ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు వెంటనే అధికారులు రంగంలోకి దిగి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి



నూతనంగా నిర్మించిన మూడు కూడళ్ల జంక్షన్ వద్ద రోజు వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలతో బైపాస్ రోడ్డుపై ప్రయాణం చేయడానికి ప్రజలు భయపడుతున్నారు. జంక్షన్ దగ్గర అధికారులు వెంటనే హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. వెంకటాపూర్‌తో పాటు రగుడు వద్ద కూడా రక్షణ చర్యలు చేపట్టాలి.

– పొన్నాల తిరుపతిరెడ్డి, వెంకటాపూర్

సిగ్నల్ ఏర్పాటు చేయాలి



వెంకటాపూర్ జంక్షన్ వద్ద అధికారులు ఒక సిగ్నల్‌ను ఏర్పాటు చేయాలి. అక్కడ రెండుసార్లు ఆటోలు ప్రమాదాలని గురయ్యాయి. జంక్షన్ కూడలిలో వాహనాలు స్పీడ్‌గా రావడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామానికి ఆనుకొని జంక్షన్ ఉండడం మూలంగా జన సమూహం అధికంగా ఉండడంతో చివరకు ఆర్టీసీ బస్సులు సైతం ప్రమాదాలకు గురవుతున్నాయి.

– దానియాల్, ఆటో డ్రైవర్, ఎల్లారెడ్డిపేట

చర్యలు తీసుకుంటాం

కొత్తగా వెంకటాపూర్ నుంచి రగుడు వరకు బైపాస్ రోడ్డు నిర్మించాం. నాలుగు నెలల క్రితమే ప్రయాణాలు ప్రారంభించారు. బైపాస్ రోడ్డును కలుపుతూ జంక్షన్‌ను ఏర్పాటు చేశాం. ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్లవైపు వెళ్తున్న వాహనాలు వేగంతో వెళ్లడం వల్ల జంక్షన్ దగ్గర అదుపు కాక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణ చర్యలు తీసుకుంటాం.

– కిరణ్, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, సిరిసిల్ల

బతుకమ్మలతో నిరసన



కోనరావుపేట: మండల కేంద్రంలో తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న వీవోఏలు బతుకమ్మలతో తమ నిరసన తెలిపారు. వీవోఏలు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

చిత్రకథ



జంక్షన్ ఎప్పుడవుతుంది?

వేములవాడరూరల్: మండలంలోని వట్టెంల ప్రధాన కూడలి వద్ద ప్రతి రోజూ వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ బస్‌స్టాప్ ప్రాంతంలో ప్రత్యేకంగా జంక్షన్ ఏర్పాటు చేస్తానని చెప్పిన పాలకులు ఏర్పాటు చేయకపోవడంతో తరచుగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఏ చిన్న వాహనాలు వచ్చినా ఈ మూలమలుపు వద్ద ఇరుకుగా ఉండడంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

వీర్నపల్లి: మండల కేంద్రంలో జిల్లా స్థాయి క్రికెట్ క్రీడా పోటీలను స్థానిక ప్రజాప్రతినిధులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దినకర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడలను ఎలాంటి గొడవలు లేకుండా స్నేహపూర్వకంగా ఆడాలన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఎస్‌ఎంసీ వైస్‌చైర్మన్ రాజేశం, క్రీడాకారులు పాల్గొన్నారు.

న్యాయవాది యుగేందర్‌పై దాడి అమానుషం

సిరిసిల్లటౌన్: న్యాయవాది యుగేందర్‌పై తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ అనుచరులు దాడికి పాల్పడటం అమానుషమని సిరిసిల్ల కాంగ్రెస్ లీగల్ సెల్ ప్రతినిధి కళ్యాణచక్రవర్తి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదులు ముందుండి స్వరాష్ట్ర సాధనలో కీలకంగా వ్యవహరించారని ఇప్పుడు అధికార అహంతో ఎమ్మెల్యే దాడి చేయించడాన్ని ఖండిస్తున్నట్లు ప్రకటించారు. మరోసారి న్యాయవాదులపై ఇటువంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని వెంకట్రావుపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీవో చంద్రయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డున్న వారందరికి పని కల్పించడం జరుగుతుందని, కూలీలందరూ ఉపాధిహామీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు



గంభీరావుపేట: మండలం రాజుపేట గ్రామంలో ఉపాధిహామీలో భాగంగా పూడికతీత పనులు చేస్తున్న కూలీలకు మంగళవారం సర్పంచ్ అల్లె సత్యం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

క్రీడాకారులకు టీ షర్టులు



వీర్నపల్లి: మండల కేంద్రంలో గ్రామీణ క్రీడాకారులకు స్థానిక జెడ్పీటీసీ గుగులోత్ కళావతి సోమవారం వీర్నపల్లి క్రీడాకారులకు టీ షర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాటి దినాకర్, సెస్ డైరెక్టర్ మల్లేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, ఉపసర్పంచ్ బోయిని రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.

తక్కువ నీటితో ఆయిల్‌పామ్ సాగు

ముస్తాబాద్: కోతుల బెడద లేకుండా అంతర పంటలు సాగు చేసుకునే విధంగా ఆయిల్‌పామ్ ఉంటుందని ఏఈవో ప్రదీప్ అన్నారు. నామాపూర్‌లో ఆయిల్‌పామ్ సాగుపై రైతువేదికలో రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. తక్కువ నీటి అవసరాలు ఉంటాయని, ఏడాదికి నిర్వహణకు ఎకరానికి ప్రభుత్వం రూ.4 వేలు ఇస్తుందన్నారు. నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఆయిల్‌పామ్ మొక్కలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులకు సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ, ఉపసర్పంచ్ తిరుపతి, రైతు నాయకులు రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు సన్మానం



రైతులకు సన్మానం చేస్తున్న అధికారులు

గంభీరావుపేట: ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులను వ్యవసాయాధికారులు సోమవారం సన్మానించారు. స్థానిక రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయిల్‌పామ్ సాగు ప్రాముఖ్యత, సబ్సిడీ వివరాల గురించి వివరించారు. సాగు చేస్తున్న రైతులకు కంపెనీ ప్రతినిధుల చేతుల మీదుగా ఒప్పంద పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు అనూష, గౌతమి, రాకేశ్, సాయితేజ, ఆర్‌బీఎస్ గ్రామ కోఆర్డినేటర్ బాలకిషన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కోనరావుపేట: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య అన్నారు. మండలంలోని కనగర్తి, కోనరావుపేట గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం సందర్శించారు. యాసంగి సీజన్‌లో 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు 75 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు తెలిపారు. 48 వేల క్వింటాళ్లు ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తయిందన్నారు. అకాల వర్షాలు, వడగండ్లు తదితర కారణాలతో దిగుబడి చాలా తగ్గిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బియ్యం ఇవ్వాలని మిల్లర్లపై ఒత్తిడి పెంచడంతో లారీలు దొరకడంలేదని, దీంతో ధాన్యాన్ని తరలించడం కొంత ఆలస్యం అవుతుందన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చూసి, 15 రోజుల్లోగా కొనుగోళ్లను పూర్తిచేస్తామన్నారు. వైస్‌చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నర్సయ్య

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై పర్శరామ్

బోయినపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై పర్శరామ్ కోరారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని హైస్కూల్ మైదానంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, రాష్‌డ్రైవింగ్, నంబర్ ప్లేట్, వాహనపత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతీ వాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత అంశాలపై జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ జరుగుతుందని తెలిపారు. సదస్సులో పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

కిట్టు కుటుంబానికి ఆర్థికసాయం

తంగళ్లపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని దేశాయిపల్లెకు చెందిన గట్టు బాల్‌రెడ్డి (కిట్టు) సిరిసిల్ల సింగిల్ విండో ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థికసాయాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, వైస్ చైర్మన్ వెంకట రమణారెడ్డి, డైరెక్టర్ వెన్నమనేని శ్రీధర్ రావు, సీఈవో నరేశ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మకు నివాళి



సిరిసిల్ల మున్సిపల్ ఆఫీసులో..



చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ..



బోయినపల్లిలో..

సిరిసిల్లటౌన్/వేములవాడరూరల్/బోయినపల్లి/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/చందుర్తి/రుద్రంగి: దళిత జనోద్ధరణ కోసం పోరాటాలు చేసిన భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల, మున్సిపల్ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

- ➡ సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జిందం కళ, మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ నివాళి అర్పించారు.
- ➡ వేములవాడరూరల్‌లో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో శ్రీధర్, ఏపీవో మల్లయ్య ఉన్నారు.
- ➡ బోయినపల్లిలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య పాల్గొన్నారు.
- ➡ తంగళ్లపల్లిలో ఎంపీపీ పడిగెల మానస, ఎంపీడీవో పి.లచ్చాలు, ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్ రెడ్డి, ఏపీవో నాగరాజు, జేఈ రాజనర్సు, నాయకులు పాల్గొన్నారు.
- ➡ ఎల్లారెడ్డిపేటలో తహసీల్దార్ జయంత్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోతే సరిత, వీఆర్వోలు, అధికారులు పాల్గొన్నారు.
- ➡ వీర్నపల్లిలో తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ మహేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- ➡ చందుర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో పత్తి రవీందర్ ఎంపీవో ప్రదీప్‌కుమార్, ఏపీవో రాజయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్ పాల్గొన్నారు.
- ➡ రుద్రంగి మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎంపీడీవో మాలోతు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

మూత్రశాలకు వెళ్లేదెలా?



కోనరావుపేట: మండలం నిమ్మపల్లి గ్రామ పంచాయతీ వద్ద నిర్మించిన మూత్రశాలలు నిర్వహణ లేక అధ్వానంగా తయారయ్యాయి. మూత్రశాల తలుపు ఊడిపోయి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు మరమ్మతు చేపట్టడం లేదు. దీంతో అది నిరుపయోగంగా మారింది. మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.